సీరియల్



(గత సంచిక తరువాయి)

చిరుతపులివల్ల తన ప్రాణాలకు ప్రమాదమని యింత సేపు అరచేత ప్రాణాలు పెట్టుకొని గడిపింది. కాని గండం గట్టెక్కింది. కాని, మృత్యువు తన కోరల్ని చాచుకొని అగ్నిరూపంలో వచ్చేస్తోంది!

సౌమ్య చకచక చెట్టు దిగింది.

మండిపోతున్న చెట్ల వెలుగుల్లో అడవిలోకి దార్లు స్పష్టంగా కనిపిస్తూన్నాయి. అంతక్రితం ఆటవికులు అటుగా వెళ్ళినచోటు స్పష్టంగానే కనిపిస్తోంది.

సౌమ్య ఓసారి గూడెం వైపు చూసింది. నిజానికి తను వెళ్ళాల్సింది ముందుకు కాదు. గూడెం దిక్కుగా— వెనక్కు. కాని, అక్కడంతా మంటలతో దహించుకు పోతోంది. మంటలు యింకా వ్యాపించని వ్యతిరేక దిశలోనే తను పరుగెత్తి ప్రాణాలు కాపాడుకోవాలి!

సౌమ్య పరుగందుకొన్నది.

దూ రం గా కొండగుహలాంటిదేదో కనిపించింది.

అక్కడికి అడవి అంతమై సమతల ప్రదేశం ప్రారంభమైంది. అయితే అది గుహలో అంతమై మళ్ళీ చెట్లు, గుట్టలు చుట్టూ ఆవరించుకున్నాయి. మంటలు అడవినంతా దహించినా ఆ గుహదాకా రావు.

సౌమ్య ప్రస్తుతానికి ఆ కొండ గుహలో గడిపెయ్యాలని నిర్ణయించుకున్నది.

లోపలికి అడుగు పెడ్తుండగా ఆమెకి అకస్మాత్తుగా అనుమానం వచ్చింది. ఆ కొండ గుహలో యేమైనా క్రూరమృగాలు నివాసముండటం లేదు కదా!

ఆమె అనుమానాన్ని 'నిజం చేస్తూ గుహలోపల్నుంచి గుర్రుమన్న శబ్దం గుండెల నదరగొడ్తూ వినిపించింది.

• • •

విషకన్య కొద్దినిమిషాలేదో తీవ్రాలోచనలో పడిపోయింది.

పక్కన నవీన్ అనిమిత్తంగా కదులుతున్నాడు. ఆలోచనలో సమయం వ్యర్థం చేయటానికి తను సుముఖంగా లేదు. అవతల సౌమ్య ఎలాంటి ప్రమాదంలో చిక్కుకున్నదో, యే క్రూరమృగాల వాతపడిందో తెలీదు. ఎలాగో యీ మూర్ఖుల బంధనాలనుంచి తప్పించుకొన్నది గాని, యీ అర్ధరాత్రి సమయంలో ఎక్కడకు పోగలదు? ఎలా ప్రాణాలు కాపాడుకో గలదు.

నవీన్ ఆ క్షణంలో విషకన్యమీద కోపం తెచ్చుకున్నాడు. ఆమె మూలంగానే సౌమ్య తను విడిపోయారు. లేకుంటే యీ పాటికి అడవినుంచి తప్పించుకుని బయటపడి వుండేవారు. విషకన్య స్వార్థానికి తమను

ఉపయోగించుకుంటున్నది....

అంతలోనే ఆమెను గురించి అలా ఆలోచిస్తున్నందుకు సిగ్గుపడ్డాడు నవీన్. అసలు ఆమె ఎప్పటికప్పుడు తమని ప్రమాదాలనుంచి రక్షించి వుండకపోతే యేనాడో తమ చరిత్ర ముగిసిపోయుండేది. సింగడినుంచి రక్షించటానికి తన అనుచరుడైన సర్పాన్ని వినియోగించింది. భీరేంద్ర నుంచి, ఆ తరువాత ఎదురైన ప్రమాదాలనుంచి చింపాంజీని ఉపయోగించి రక్షించింది. అందులో ఆమె స్వార్థం వున్నా, అది తమకే ఎక్కువగా ఉపయోగపడింది.

తను లేకపోయినా ఆమె తన ప్రతీకారం చెల్లించుకో గలదు. కాని ఆమె లేకుంటే తామిద్దరు బతికి వుండేవారు కాదు! నవీన్ మనసు విషకన్యపట్ల కృతజ్ఞతతో నిండి పోయింది.

సౌమ్య కనిపించకుండా పోయినందుకు తనకన్నకూడా ఆమె ఎక్కువ బాధపడుతోంది. తన ప్రతీకారం విషయం కూడా మరచి, ఆమెను వెతకటానికి ముందు ప్రాధాన్యత నిచ్చింది.

తన ప్రాణంపోయినా, ఆమెకు సహాయపడాలి! ఆమె ప్రతీకారం తీర్చుకోవటానికి తన శక్తివంచన లేకుండా కృషి చేయ్యాలి. ఆమె తల్లిదండ్రుల ఆత్మలకు శాంతి కలగ చెయ్యాలి.

నవీన్‌లో నూతనోత్సాహం వెల్లువికింది.

"సారీ మిస్టర్ నవీన్. మిమ్మల్ని యిబ్బంది పెడుతున్నందుకు క్షమించండి. నా కంఠంలో ప్రాణమున్నంతవరకు మీ సౌమ్యకెలాంటి ఆపదరాదు. సురక్షితంగా మీ కప్పగిస్తాను" అన్నది విషకన్య.

తన మనసులో చెలరేగుతున్న ఆలోచనల్ని ఆమె పసి

కట్టినందుకు సిగ్గుపడ్డాడు నవీన్. అంతేకాదు, మొదట్నుంచీ ఏకవచనంలోనే మాట్లాడుతూ వచ్చిన విషకన్య యిప్పుడు తనని మన్నించి బహువచనంలో మాట్లాడటం ఆమె ఉన్నత సంస్కారాన్ని సూచిస్తూన్నా, ఎందుకో యిబ్బందిగా ఫీలయ్యాడు. వెంటనే ఆమెతో చెప్పేశాడు.

"నన్ను గౌరవ వాచకంతో మన్నించొద్దు. మన దూరం పెరిగిపోయినట్టనిపిస్తోంది. నేను కూడా 'మీరు' అని మన్నించాల్సి వుంటుంది" అన్నాడు నవీన్.

"ఒద్దొద్దు. నువ్వు అనే పిలుస్తాను. సరేనా?" నవ్వేసింది విషకన్య. ఆమె ఆ క్షణంలో తన కంటికి ఆత్మీయురాలిలాగా కనిపించింది నవీన్‌కి.

తనూ నవ్వి, "నా ఆలోచన కేవలం సౌమ్య గురించే కాదు; నీ గురించి కూడా! మా యిద్దరికీ అడుగడుగునా సాయపడ్డ నీకు ఏమిచ్చి ఋణం తీర్చుకోగలనా అని యోచిస్తున్నాను" అన్నాడు.

"ఋణాలు, కృతజ్ఞతలు తరవాత. ఓ పక్క అడవి తగలబడిపోతోంది. ఉగ్రనాగు గాని తక్కిన సర్పాలు గాని లోపలికి ప్రవేశించటం క్షేమకరం కాదు. మన కోసం ఉగ్రనాగు ప్రాణాలను పణంగా పెట్టి లోపలకు—సౌమ్య వెళ్ళిన దిశలో—చొచ్చుకుపోగలిగాడు.

కాని యిప్పటికే అడవంతా నేలబారున తగలబడుతోంది. పచ్చి మొక్కలు కూడా కాలుతున్నాయి. ఉగ్రనాగు మంటల్లో ఆహుతయిపోకూడదు. ఉగ్రనాగు ఎలాగూ దారి చూపించింది గాబట్టి మనిద్దరం ఆ బాట వెంబడి పోయి సౌమ్య కోసం వెదుకుదాం, సరేనా?" అన్నది విషకన్య.

(సశేషం)